క్లుప్తంగా

5న ప్లాస్టిక్ కాలుష్యంపై సదస్సు

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 5న ఓయూ దూరవిద్య కేంద్రంలో జాతీయ సదస్సు జరగనుంది. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ కాలుష్యం పరిష్కారం అనే అంశం పై జరిగే జాతీయ సదస్సు వాల్‌పోస్టర్‌ను గురువారం వీసీ రవీందర్, రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి, పబ్లిక్ పాలసీ ఎక్స్‌పర్ట్ డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి వక్తలుగా పాల్గొని ప్రసంగిస్తారని ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ నవీన్ తెలిపారు.

ఫీజులు తగ్గించే వరకూ పోరాడతాం



విద్యార్థులను అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పీహెచ్‌డీ విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం పాలక మండలి సమావేశం జరుగుతుండగా పీహెచ్‌డీ ఫీజుల పెంపు అంశాన్ని చర్చించేందుకు కార్యాలయంలోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకొని పీఎస్‌కు తరలించారు. ఫీజులు పెంచి పేద విద్యార్థులను చదువులకు దూరం చేయలేరని పోలీస్ స్టేషన్లలో పుస్తకాలు చదువుతూ నిరసన తెలిపారు. పెంచిన ఫీజును తగ్గించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఠాణాలో పాము కలకలం



లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌లో గురువారం పాము కలకలం రేపింది. ఇటీవల నూతనంగా నిర్మాణం చేసిన పోలీసు బ్యారక్‌లో గురువారం దాదాపు 3 ఫీట్ల పొడవైన నాగుపాము రావడంతో సిబ్బంది బయటకు పరుగులు తీస్తున్నారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకటేష్ నాయక్ పామును చాకచక్యంగా పట్టుకోవడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

పౌష్టికాహారం అందజేత



పౌష్టికాహారాన్ని వడ్డిస్తున్న హేమలత

బన్సీలాల్‌పేట్: పేద మహిళల ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం ఎంతో దోహదపడుతుందని కార్పొరేటర్ హేమలత అన్నారు. భోలక్‌పూర్ అశోకా యువజన సంఘం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గర్భిణులు, బాలింతలు, శిశువులకు పౌష్టికాహారాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని వడ్డించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. దీంతో ఎంతో మంది పేద మహిళలకు పౌష్టికాహారం లభిస్తుందన్నారు. ఆరోగ్యం విషయంలో మహిళలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. మానసిక ప్రశాంతత, శారీరక వ్యాయామం ద్వారానే ఆరోగ్యం పదిలంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హరిప్రియసావిత్రి పాల్గొన్నారు.

'గురుకులాల'కు 17 మంది విద్యార్థులు ఎంపిక

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ భోలక్‌పూర్ క్రిష్టానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు తెలంగాణ గురుకులాలకు ఎంపికయ్యారు. గురువారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థులను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ.. పాఠశాల నుంచి 20 మంది ప్రవేశ పరీక్ష రాయగా 17 మంది ఎంపికయ్యారన్నారు. మంచుకొండ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ కొండ ప్రకాశం సహకారంతో ప్రత్యేకంగా టీచర్‌ను నియమించి ప్రవేశ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేశామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మంచుకొండ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రకాశం, అనితా, రవికుమార్, సురేందర్, అరుణ్‌కుమార్, వరుణ్‌కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు.



ఎంపికైన విద్యార్థులతో మల్లికార్జున్‌రెడ్డి, తల్లిదండ్రులు

పెండింగ్ పనుల్లో పుంజుకున్న వేగం!

- అభివృద్ధి పనులకు లభిస్తున్న మోక్షం
- కొన్నింటికి ప్రారంభోత్సవాలు, చివరి దశలో మరికొన్ని పనులు
- నిమగ్నమైన అధికారులు
- ఎన్నికల కోసమే అంటున్న విపక్షాలు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వివిధ అభివద్ధి పనులకు ఈ ఏడాది మోక్షం లభించనుంది. సాంకేతిక కారణాలతో ముందుకు సాగని అభివద్ధి పనులు ఇప్పటికే కొన్ని ప్రారంభం కాగా మరికొన్ని పనులను త్వరలోనే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కరోనా లాక్‌డౌన్ పరిస్థితులు మొదలు ఆర్థిక మాంద్యం తదితర కారణాలతో నిలిచిపోయిన పనులు ఈ ఏడాది పూర్తి చేస్తున్నట్లు అధికారులు చెబుతుండగా ఈ డిసెంబర్‌లో శాసనసభ ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో హుటాహుటిన ప్రారంభిస్తున్నట్లు విపక్షాల నాయకులు ఆరోపిస్తున్నారు. కమ్యునిటీహాళ్లు, రహదారులు, డ్రైనేజీ లైన్లు తదితర అభివద్ధి పనులతోపాటు మరికొన్ని భారీ అభివద్ధి పనులు చేపట్టేందుకు ఈ ఏడాది మోక్షం లభించినట్టయింది. ప్రారంభమైన పనులను వేగవంతంగా పూర్తి చేయడం, కొత్త అభివద్ధి పనులు వీలైనంత త్వరగా ప్రారంభించేందుకు జలమండలి, జీహెచ్‌ఎంసీ విభాగాల అధికారులు సమాయత్తం అవుతున్నారు. మురికివాడలకు నిలయంగా ఉన్న అడ్డగుట్ట, బౌద్ధనగర్, మెట్టుగూడ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాలు సమస్యలకు పరిష్కారం చేపే విధంగా పనులు చేపడుతున్నారు. సమస్యలు జటిలంగా ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కార మార్గం చూపేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.



మూడేళ్ల తర్వాత ఊపందుకున్న అడ్డగుట్ట మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్ పనులు

కమ్యూనిటీ హాళ్లకు మోక్షం..

నియోజకవర్గం పరిధిలోని ఐదు డివిజన్లలో పది కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో దాదాపు అన్నింటికి నిధులు కేటాయించారు. టెండర్ల వ్యవహారం కూడా పూర్తయి నెలల తరబడి పనులు ప్రారంభం కాని వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన తొమ్మిది కమ్యూనిటీహాళ్ల నిర్మాణం పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రెండు మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. లాలాపేట, అడ్డగుట్ట ప్రాంతాల్లో రూ.14.15 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం పనులు కొనసాగుతుండగా రూ.కోటితో చేపట్టిన కమ్యూనిటీహాల్ పనులు తుది దశకు చేరుకున్నాయి. మధురానగర్‌లో రూ.2 కోట్లతో నిర్మించిన మ్యూమ్యునిటీహాల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం అదనంగా రూ.80 లక్షలు కేటాయించారు.

త్వరలో మరిన్ని పనులు..

జూన్ మొదటి వారంలో కొన్ని, చివరివారంలో మరికొన్ని భారీ అభివద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేయనున్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. సీతాఫల్‌మండిలో రూ.20 కోట్లతో విద్యాసంస్థల భవన సముదాయం, రూ.12.75 కోట్లతో కుట్టివెల్లోడి ఆసుపత్రి భవన సముదాయం, చిలకలగూడ ఆలుగడ్డబావి వంతెన వద్ద రూ.30 కోట్లతో ఆర్‌యూబీ, మాణికేశ్వరీనగర్ వద్ద రూ. 20 కోట్లతో మరో ఆర్‌యూబీ పనులు ప్రారంభం కానున్నాయి.

రహదారులు.. నాలాలు

ప్రధాన, అంతర్గత రహదారులు కలుపుకుని మొత్తంగా వందకు పైగా రహదారుల నిర్మాణాలు ఈ ఏడాదిలో పూర్తి చేయడం గమనార్హం. అంతర్గత, కాలనీల రహదారులు కలుపుకుని పెండింగ్‌లో ఉన్నవి, కొత్తగా ప్రతిపాదిత రహదారుల నిర్మాణానికి కార్యరూపం ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధమవుతుంది. మొత్తంగా రూ.16 కోట్లతో రహదారుల నిర్మాణం పనులు జరుగుతుండగా, మరి కొన్ని రహదారులకు నిధులు మంజూరు కావాల్సి ఉంది. పలు రిటైనింగ్‌వాల్స్ నిర్మాణాలు, పూడిక తీత పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. లాలాపేట నుంచి అడ్డగుట్ట, మెట్టుగూడ నుంచి వారాసీగూడ వరకు ఆవరించి ఉన్న నాలా గోడల మరమ్మతు పనులు పూర్తి చేస్తున్నారు. వరద కాల్వలు, నాలాల్లో పూడికతీత పనుల కోసం రూ.15 కోట్లు, డ్రైనేజీ నిర్మాణాల కోసం రూ.15 కోట్లను కేటాయించారు. నామాలగుండులో రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన అభివద్ధి పనులు వేగం పుంజుకున్నాయి. లాలపేటలో చేపట్టిన స్విమ్మింగ్‌పూల్ పనులు తుదిదశకు చేరుకున్నాయి.

భక్తుల మనోభావాలకు తగ్గట్టుగా ఆలయాభివృద్ధి



రథం మండప నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి తలసాని

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: ప్రభుత్వ నిధులతో పాటు దాతల సహకారంతో భక్తుల మనోభావాలకు అనుగుణంగా దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అమీర్‌పేటలోని కనకదుర్గమ్మ ఆలయంలో తెలంగాణ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు, శ్రీనివాస సమాజ సేవా సమితి ట్రస్టీ, రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి పార్థసారథి, సుశీల దంపతులు, వారి కుమార్తె పద్మజ, అల్లుడు శివకుమార్ సహకారంతో నిర్మించనున్న రథం మండపం నిర్మాణ పనులను గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మవారి ఆలయానికి రోజురోజుకు వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, అందుకనుగుణంగా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. దాతల సహకారంతో ఇప్పటికే ఆలయం ముందు రేకుల షెడ్డు నిర్మాణం, గ్రానైట్ ఏర్పాటు వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అమ్మవారి ఉత్సవాల సమయంలో ఊరేగింపు నిర్వహించే రథం కోసం నూతనంగా మండపం నిర్మాణ పనులు ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్.శేషుకుమారి, ఈఓ నరేందర్, చైర్మన్ మల్లికార్జునప్ప, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నర్సింహ, గులాబ్‌సింగ్, శ్రీలక్ష్మీ పాల్గొన్నారు.

క్రీడలకు సమయం కేటాయించాలి..

రసూల్‌పురా: విద్యార్థులు కొంత సమయం క్రీడల కోసం కేటాయించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మారేడ్‌పల్లి మున్సిపల్ గ్రౌండ్‌లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్ ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. వివిధ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, డీసీలు ముకుంద రెడ్డి, వేణుగోపాల్, కార్పొరేటర్ దీపిక, స్పోర్ట్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

శ్రీసాయి విద్యాలయ విద్యార్థులకు అవార్డులు



అవార్డులు అందుకున్న విద్యార్థులతో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: పది ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన శ్రీసాయి విద్యాలయ విద్యార్థులకు శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ ప్రతిభా అవార్డులను అందించారు. ముషీరాబాద్ మండల పరిధిలో శ్రీసాయి విద్యాలయ విద్యార్థులు ఎక్కువ మంది ఉత్తమ ర్యాంకులు సాధించిన నేపథ్యంలో సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారికి అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదవడం ద్వారా జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. ఉత్తమ విద్యాబోధనల ద్వారా మంచి ఫలితాలు రాబట్టిన శ్రీసాయి విద్యాలయ యాజమాన్యం, టీచర్లను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కేఎస్.వెంకటేశ్, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, లింగాని ప్రసన్నలక్ష్మి, ఉపాధ్యాయులు సుధామాధవి, రత్నకుమారి, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

త్వరలో ఆస్పత్రి, విద్యాసంస్థల భవనాల పనులు ప్రారంభం



భూమిపూజ నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్



డిప్యూటీ స్పీకర్‌కు సమస్యలు వివరిస్తున్న కాలనీ ప్రతినిధులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో నిర్మించనున్న రెండు భారీ అభివృద్ధి పనులకు త్వరలో శ్రీకారం చుట్టనున్నట్లు శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ చెప్పారు. గురువారం సీతాఫల్‌మండిలో రూ.30 కోట్లతో నిర్మించనున్న విద్యా సంస్థల భవనం, రూ.12.75 కోట్లతో నిర్మించనున్న ఆసుపత్రి భవన నిర్మాణం చేపట్టనున్న స్థలాల్లో ఆయన భూమి పూజ నిర్వహించి మాట్లాడారు. త్వరలో విద్యా సంస్థల భవన నిర్మాణ పనులకు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆసుపత్రి భవన నిర్మాణం పనులను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి టీ.హరీష్‌రావు ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమాల్లో జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, లింగాని లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం..

తార్నాక డివిజన్ నాగార్జుననగర్ కాలనీ సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ హామీ ఇచ్చారు. గురువారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చిన నాగార్జుననగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు డిప్యూటీ స్పీకర్‌ను కలిశారు. కాలనీలోని కమ్యూనిటీహాల్ భవన విస్తరణ పనుల నిమిత్తం వినతిపత్రాన్ని అందించారు. స్పందించిన డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ నాగార్జుననగర్ కాలనీలో ఇప్పటికే ముమ్మర అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దామన్నారు. కమ్యూనిటీహాల్ విస్తరణ పనులకు తనవంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ టి.తిరుపతిరావు, ఏ.జలంధర్ రెడ్డి, ఎస్.నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలి

రసూల్‌పురా: ద శాబ్ది ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం ఈ తొమ్మిదేళ్లలో కంటోన్మెంట్ బోర్డు పరిధిలో చేసిన అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయాలని బోర్డు నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం బోర్డు కార్యాలయంలో బోర్డు సమావేశం అనంతరం ఆయన మాట్లాడారు. తొమ్మిదేళ్లలో కంటోన్మెంట్ బోర్డు పరిధిలో అభివృద్ధి కోసం ఖర్చు చేసిన విషయమై వివరాలు తెలపాలని సీఎం కేసీఆర్‌కు రాసిన లేఖను చూపించారు. రోడ్ల అభివృద్ధికి రూ.50 కోట్లు, నాలాలు, కల్వర్టుల నిర్మాణానికి రూ.250 కోట్ల ప్రత్యేక నిధులు విడుదల చేయాలని సీఎం కేసీఆర్‌ను లేఖలో కోరామన్నారు. కొందరు మంత్రులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి తామేదో నిధులు విడుదల చేయించి కంటోన్మెంట్‌లో అభివృద్ధి చేసినట్లు ఉపన్యాసాలు ఇస్తున్నారని కంటోన్మెంట్ అభివృద్ధిపై ఎవరైనా మంత్రి బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. రూ.320 కోట్ల రూపాయల అంచనాలతో రూపొందించిన ఈ యేడు వార్షిక బడ్జెట్‌లో 70 కోట్ల కేవలం అభివృద్ధికే కేటాయించామని రామకృష్ణ వెల్లడించారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 4న సూర్యాపేటలో జరిగే తెలంగాణ జన సమితి (టీజేఎస్) 3వ ప్లీనరీని విజయవంతం చేయాలని టీజేఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. గురువారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ప్లీనరీ విజయవంతం కోసం రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగేష్, నరేందర్, కృష్ణ, రాము, బాలు, సతీష్, కిరణ్, అక్షయ్, ప్రవీణ, రేణుకా, అనిత, సురేందర్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సనత్‌నగర్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని బీపీఓ కన్వర్జన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉద్యోగులకు గురువారం రోడ్డు భద్రతపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శంకర్‌రాజు మాట్లాడుతూ.. మనమే జీవితంగా భావిస్తూ మనపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని వాహనాలను నడపాలన్నారు. రాంగ్ రూట్‌లో వెళ్లడం ద్వారా వారు ఇబ్బంది పడటమే కాకుండా ఇతరులను సైతం ఇబ్బందికర పరిస్థితులను సృష్టించిన వారవుతారన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, త్రిబుల్ రైడింగ్ చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. పాదచారులు ఎక్కడపడితే అక్కడ రోడ్డు దాటకుండా కేవలం జీబ్రా క్రాసింగ్ వద్దనే దాటి వాహనదారులకు సహకరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నిషేధమని 18 సంవత్సరాలు నిండిన యువత డ్రైవింగ్ లైసెన్స్ పొందిన తర్వాతనే వాహనాలు నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది కాల్‌సెంటర్ సిబ్బందితో పాటు టీటీఐ ఎస్ఐ జ్యోతి, సిబ్బంది చక్రధర్, వెంకటప్రసాద్, నర్సింహ, బీపీఓ కన్వర్జన్స్ ప్రాసెస్ మేనేజర్ శ్రీనివాస్, శ్రీకాంత్, లక్ష్మీ పాల్గొన్నారు.

4న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

బంజారాహిల్స్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో జ్యైష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 4వ తేదీన ఉదయం 9.30 గంటల నుంచి గుర్తించిన ఆలయాల్లో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ సహాయ కార్యనిర్వహణాధికారి చతుర్వేదుల సత్యనారాయణ వెల్లడించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో శ్రీ రామలింగేశ్వరసాయి క్షేత్రం, ప్రశాంతి హిల్స్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ప్రతినెలలో పౌర్ణమి నాడు రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల్లో నిర్వహిస్తున్నామన్నారు. సంయుక్త కార్యనిర్వహణాధికారి సభా భార్గవి నేతృత్వంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు.

కేరళ స్టోరీ ఓ ప్రచారపు ఎత్తుగడ

పంజగుట్ట: కేరళ స్టోరీ సినిమా ఓ ప్రచారపు (ప్రాపగండా) ఎత్తుగడ సినిమాల కోవలోకి వస్తుందని, ఒక ప్రయోజనాన్ని ఆవించి ఆ సినిమా తీశారని కేరళ రాష్ట్రానికి చెందిన సుప్రసిద్ధ పాత్రికేయులు, రచయిత వి.కె.చెరియన్ వ్యాఖ్యానించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఇండియా (మెఫి) ఆధ్వర్యంలో కేరళ స్టోరీ సినిమాపై నిర్వహించిన సెమినార్‌లో చెరియన్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేరళ నుంచి 32 వేల మంది యువతులు అదృశ్యమైన నేపథ్యంలో ఈ సినిమా తీశామని నిర్మాతలు మొదట చెప్పుకున్నారని, తీరా కోర్టుకు వెళ్లే సరికి ముగ్గురు యువతుల కిడ్నాప్‌కు సంబంధించిన కల్పితగాథ అని సంజాయిషీ ఇచ్చుకున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మెఫీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, మెఫీ మేనేజింగ్ ట్రస్టీ దేవులపల్లి అమర్, ఐజేయూ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఎ.మాజీద్ తదితరులు పాల్గొన్నారు.

కేర్ వైద్యుడికి రాష్ట్రీయ చికిత్సా రత్న అవార్డు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి ఆర్థోపెడిక్ రొబోటిక్ సర్జన్ డాక్టర్ మనోజ్ కుమార్ గుడ్లూరు అరుదైన పురస్కారాన్ని అందుకున్నారు. నేషనల్ అచీవర్స్ రికగ్నిజేషన్ ఫోరం ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరిగిన ఇండివిడ్యువల్ అచీవ్‌మెంట్స్, ఇంటలెక్చువల్ ఎక్సలెన్స్, నేషనల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా కేర్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ మనోజ్ కుమార్ గుడ్లూరు తెలంగాణ రాష్ట్రం తరఫున రాష్ట్రీయ చికిత్సా రత్న అవార్డును విధాన సభ స్పీకర్ శ్రీరామ్ నివాస్ గోయెల్, కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి రాజ్‌కుమార్ ఆనంద్, ఢిల్లీ మేయర్ షెల్లీ ఒబేరాయ్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా మనోజ్ కుమార్ మాట్లాడుతూ... దేశ వ్యాప్తంగా 24 విభాగాల్లో విశిష్ట సేవలు అందించిన వారిని గుర్తించి ఈ పురస్కారాలు ప్రధానం చేశారని తాను 8 వేలకు పైగా శస్త్రచికిత్సలు చేయడంతో పాటు 600లకు పైగా క్లిష్టమైన శస్త్ర చికిత్సలను చేశానని తన సేవలను గుర్తించి ఈ పురస్కారం అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డు మరింత బాధ్యను పెంచిందని మరింత మందికి సేవలు అందించేందుకు ప్రోత్సహించిందని అన్నారు.

'డబుల్' ఇళ్ల పేరిట రియల్ ఎస్టేట్ దందా

వైఎస్‌ఆర్‌టీపీ సికింద్రాబాద్ కో ఆర్డినేటర్ శిల్పాచారి

చిలకలగూడ : సికింద్రాబాద్ ఎమ్మెల్యే డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ డబుల్ ఇళ్ల పేరిట రియల్ ఎస్టేట్ దందా నడుపుతున్నారని వైఎస్‌ఆర్‌టీపీ సికింద్రాబాద్ కో ఆర్డినేటర్ శిల్పాచారి ఆరోపించారు. వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల ఆదేశాల మేరకు మెట్టుగూడ డివిజన్ ధోబీఘాట్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయం వద్ద గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. సికింద్రాబాద్‌లో పదివేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మిస్తానని మేనిఫెస్టోలో హామీ ఇచ్చి రెండు పర్యాయాలు గెలిచిన పద్మారావు ఇప్పటి వరకు కేవలం 419 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారన్నారు. తక్షణమే మేనిఫెస్టోలో పేర్కొన్న పదివేల డబుల్ ఇళ్లు నిర్మించి నిజమైన లబ్ధిదారులకు కేటాయించాలన్నారు.

వ్యాయామ విద్య డీన్‌గా ప్రొ.రాజేష్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వ్యాయామ విద్య (ఫిజికల్ ఎడ్యుకేషన్) ఫ్యాకల్టీ డీన్‌గా సీనియర్ అధ్యాపకులు ప్రొ.రాజేష్‌కుమార్ నియమితులయ్యారు. గతంలో వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపల్, హెడ్, బీవోఎస్, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా పదవులు చేపట్టిన ప్రొ.రాజేష్‌కుమార్ డీన్‌గా నియమితులవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

టీఎస్‌పీసీబీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మధుగౌడ్



మధుసూదన్‌గౌడ్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ) ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సి.మధుసూదన్‌గౌడ్ ఎన్నికయ్యారు. మూడేళ్లకోసారి జరిగే ఎన్నికల్లో భాగంగా గురువారం ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ద్వారా అసోసియేషన్ నూతన కార్యవర్గానికి అభిప్రాయ సేకరణ చేపట్టారు. మధుసూదన్‌గౌడ్‌కు పోటీగా మరొకరు నిలబడినప్పటికీ ఉద్యోగులందరూ మధుసూదన్‌గౌడ్ వైపే మొగ్గు చూపారు. గత 11 సంవత్సరాలుగా ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న మధుసూదన్‌గౌడ్‌కే మరోసారి అధ్యక్ష పదవి వరించింది. ప్రధాన కార్యదర్శిగా నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా స్వర్ణలత, వివేకానందమూర్తి, కోశాధికారిగా రాధాకిషన్, రఘునందన్‌లతో పాటు మరికొంతమంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

లాలాపేట: గుర్తు తెలియని ఓ వృద్ధుడి మృతదేహం లభ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 31న మధ్యాహ్నం లాలాపేట వినోభానగర్ వద్ద ఓ ఇంటి మందు సుమారు 70 వయస్సున్న ఓ వృద్ధుడు ఎండలో పడుకొని ఉండటాన్ని గమనించిన ఇంటి యజమాని చెట్టు నీడలో పడుకోవాలని సూచించినప్పటికీ ఎలాంటి స్పందన లేదు. సమాచారం అందుకున్న పోలీసులు, 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.